క్లుప్తంగా

నేడు సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామంలో సోమవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించే కేంద్రంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందిస్తామని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో గజ్జలమ్మదేవికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

బతుకమ్మ వేడుకలు



కుంటాలలో బతుకమ్మ వద్ద ఆడబిడ్డలు

కుంటాల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల వద్ద ఆడిపాడారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌ను కలిసిన జాన్సన్‌నాయక్



కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్

ఖానాపూర్: దసరా పండుగను పురస్కరించుకుని మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్వేల్‌లోని వ్యవసాయక్షేత్రంలో వారిని కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని దేవరకోట పాలకమండలి సభ్యుడిగా రెండోసారి ఎన్నికైన మోత్కూరి దేవేందర్ గౌడ్‌ను ఆదివారం గీత పారిశ్రామిక సహకార సంఘ భవనంలో నిర్మల్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోల జీవన్‌గౌడ్, మోకుదెబ్బ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, గౌడ సంఘం నాయకులు కౌన్సిలర్ నర్సాగౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

పెంబి: పది రోజులుగా సాగిన పీపీఎల్–3 (పెంబి ప్రీమియర్ క్రికెట్ లీగ్) ముగిసింది. ఆది వారం ఫైనల్‌లో రెయింబో వారియర్స్, పెంబి ప్రీమియర్ స్ట్రైకర్ జట్లు తలబడగా రెయింబో వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతకు బహుమతి రూ.20వేలను నిర్మల్‌లోని ఆదిత్య ఆసుపత్రి నిర్వాహకులు అందించారు. రన్నరప్ జట్టు పెంబి ప్రీమియర్ స్ట్రైకర్ రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో పీపీఎల్ నిర్వాహకులు నరేశ్, మతీన్, మహేశ్, ఇస్మాయిల్, షారుఖ్, రాము, నాయకులు, ఆదిత్య ఆసుపత్రి బృందం తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన గ్రామంలోని సుధీర్‌రెడ్డి జట్టుకు రూ.20వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన వెంకటరమణా జట్టుకు రూ15వేలు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్‌లో శని వారం ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఏటా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పూర్తయిన తర్వాత దసరా రోజు ఎల్లమ్మ జాతర నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, గ్రామస్తులు, పోలీసులు ఏర్పాట్లు చేశారు.

ముధోల్: దసరా పండుగ పురస్కరించుకొని మండలంలోని కారేగాం గ్రామంలో శని వారం ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లోకేశ్వరం : ధర్మోరలో..



కుంటాలలో దుర్గాదేవి శోభాయాత్రలో గ్రామస్తులు



నిర్మల్‌లోని నాగ్రేశ్వరవాడలో దుర్గాదేవి ప్రతిమ వద్ద భక్తులు



కడెంలో శోభాయాత్రలో భక్తులు

వెళ్లిరా దుర్గమ్మ

నిర్మల్‌టౌన్/సారంగపూర్/కడెం/లోకేశ్వరం/లక్ష్మణచాంద/కుంటాల/తానూరు/భైంసారూరల్/కుబీర్: జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో దుర్గామాతకు ఘనంగా వీడ్కోలు పలికారు. దుర్గమ్మా.. వెళ్లి రావమ్మా అంటూ.. భక్తులు వేడుకున్నారు. నిర్మల్‌లోని బాగులవాడ, నాగ్రేశ్వరవాడ, రాంమందిర్, బంగల్ పేట్, బుధవార్‌పేట్, వెంకటాద్రిపేట్, గాంధీనగర్, ప్రియదర్శినినగర్, శాస్త్రినగర్, ఆదర్శ నగర్, భాగ్యనగర్, రవినగర్, శాంతినగర్, బాలాజీవాడ, ధ్యాగావాడ, గాయత్రి టౌన్‌షిప్, శ్రీనగర్‌లో నెలకొల్పిన అమ్మవారి ప్రతిమల శోభాయాత్రను పురవీధుల గుండా నిర్వహించారు. యువత, మహిళలు కోలాటం వేస్తూ.. నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం పట్టణాలు, గ్రామాల సమీపంలోని చెరువుల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



లక్ష్మణచాంద : పొట్టపెల్లిలో అమ్మవారి శోభాయాత్ర



సారంగపూర్‌లో అమ్మవారి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు



తానూరు: బోల్సాలో దుర్గాదేవి శోభాయాత్రలో భక్తులు



నిర్మల్‌లోని బంగల్‌పేట్‌లో...

దమ్మచక్రపరివర్తన్ దివస్



ఉమ్రి(కే)లో వందన కార్యక్రమంలో నాయకులు



భైంసారూరల్ : తిమ్మాపూర్‌లో..

తానూరు: దమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు ఉమ్రి(కే), దౌలతాబాద్, తానూరు, బెంబర, ఎల్వి గ్రామాల్లో బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు సురేకాంత్ పవార్ మాట్లాడారు. విజయదశమిని పురస్కరించుకుని 1956 అక్టోబర్ 14న అంబేద్కర్ మహారాష్ట్రలోని నాగపూర్‌లో 50 వేల మందితో దమ్మదీక్ష తీసుకోవడంతో ఈ కార్యక్రమం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు.అనంతరం పంచరంగి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహాసభ నాయకులు వాగ్మారే గంగాధర్, భీమ్ పవార్, ఆనంద్‌రావ్, గంగాధర్ భన్సుడే భారతీయ బౌద్ధమహాసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్, వానల్ పాడ్, కుంబి, మిర్జాపూర్, టాక్లి, లింగా, కోతల్‌గాం గ్రామాల్లో ఆదివారం దమ్మచక్రపరివర్తన్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని వెంకూర్‌లో శనివారం దమ్మ చక్రపరివర్తన్ దివస్ నిర్వహించారు. అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, సుధాకర్, అశోక్, గణేశ్, నారాయణ, పోతన్న, రవిప్రసాద్, గజానంద్‌రావు, గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



కుంటాలలో ధ్వంసం చేసిన విద్యుత్ పరికరాలు



పాఠశాల వరండాలో మద్యం సీసాలు

కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వడంతో కొందరు యువకులు గేటు దూకి పాఠశాలలో మద్యం తాగి, సీసాలు, గ్లాసులు అక్కడే పడేసి వెళ్లడంతో ఆవరణ అపరిశుభ్రంగా మారింది. పాఠశాలలోని ఎలక్ట్రికల్ వస్తువులను ధ్వంసం చేశారు. సమాచారం తెలిసి ఎంఈవో ముత్యం ఆదివారం పాఠశాల సందర్శించారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

తైక్వాండో ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, –17 బాలబాలికల విభాగాల్లో తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అండర్–14లో ఎనిమిది మంది, అండర్–17లో ఇద్దరు క్రీడాకారులు మంచిర్యాలలో సోమవారం నిర్వహించే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పేటా కార్యదర్శి భోజన్న, వన్నెల భూమన్న, అమ్ముల భూషణ్, తేజేందర్‌సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

‘నేతకానీలను రాజకీయంగా గుర్తించాలి’

కడెం: నేతకానీలను రాజకీయంగా ఎదిగేలా గుర్తించాలని నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గె వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నేతకానీల సమస్యలు, నేతకానీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇందులో నేతకానీ సంఘం నాయకులు తదితరులున్నారు.

లోకేశ్వరం: ఆదిలాబాద్‌లో జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని ఆదివారం లోకేశ్వరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మాదరి ఆంజనేయులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లోకేశ్వరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మాదరి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు దండేరమేశ్, మగ్గిడి రాజు, గౌని గంగాధర్ ఉన్నారు.



కడెం: ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

దసరా వేడుకలు

జిల్లావ్యాప్తంగా శనివారం దసరా పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు స్వస్థలాలకు రావడంతో పల్లెలు సందడిగా మారాయి. ఈసందర్భంగా ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద జమ్మిచెట్టుకు శమీపూజ నిర్వహించారు. తమ బంధం చిరకాలం కొనసాగేందుకు జంబి ఆకు(బంగారం)ను కుటుంబసభ్యులు, బంధుమిత్రులకు పంచిపెట్టి పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఒకరికొకరు అలాయ్.. బలాయ్ చెప్పుకొని సందడిగా గడిపారు. చెడుపై మంచి విజయం సాధించిన సంకేతంగా పలుచోట్ల రావణవధ ఘట్టాలు నిర్వహించారు. పలువురు తమ వాహనాలకు వాహనపూజ చేశారు. పోలీస్‌స్టేషన్లలో పోలీసులు ఆయుధపూజ నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రాంలీలా మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు మంత్రరాజ్యం సురేశ్, శెట్టి శ్యాం, నాయకులు ధ్వజారోహణ చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం పదితలల రావణాసురుడి ప్రతిమను దహనం చేశారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి నెట్‌వర్క్



కుంటాల : కల్లూరులో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



లక్ష్మణచాంద:పొట్టపెల్లిలో వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



కుభీర్‌లో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



ఖానాపూర్‌లోని కళాశాలలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నాయకులు



ఖానాపూర్ రాంలీలా మైదానంలో వేడుకలకు హాజరైన జనం



నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజలో పాల్గొన్న సిబ్బంది



తానూరులో ముస్లింలకు జమ్మి పెడుతున్న స్థానికులు

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

- 17న జాతర, రథోత్సవం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 19వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 13న స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, కులదేవతాస్థాపన నిర్వహించినట్లు పేర్కొన్నారు. 14న అభిషేకం, మంగళహారతి, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన, విష్ణుయాగం, అన్నదానం, ధ్వజారోహణతోపాటు రాత్రికి స్వామివారి ఎదుర్కోళ్ల అనంతరం కల్యాణం, 15న విష్ణుయాగం, బలిహారణం, సదస్యం వేదగోష్ఠి, భేరిపూజ, 16న పండితులు శ్రీమాన్ చక్రపాణి నర్సింహమూర్తిచే దోపు కథాకాలక్షేపం, 17న విష్ణుయాగం, నవగ్రహయాగం, మంత్ర పుష్పంతోపాటు జాతర, రథప్రాణప్రతిష్ఠ, రథబలి, రథోత్సవంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, 18న పూర్ణాహుతి, శేషహోమం, బలిహారణం, అభిషేకార్చనలు, 19న పుష్పయాగం, నాగవెల్లి, ఉద్వాసనబలి, గ్రామబలితో ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు ఆచార్య కోటపల్లి అనీశ్ తెలిపారు.



సుర్జాపూర్ ఆలయం (ఫైల్)

తీజ్ సంబరాల్లో ఎమ్మెల్యే

కుంటాల: మండలంలోని అంబకంటి తండాలో శనివారం తీజ్ సంబ రాలు ఘనంగా నిర్వహించారు. దీ నికి ముఖ్య అతిథిగా ముధోల్ ఎ మ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరై పూజలు చేశారు. నీట్‌లో సీటు సాధించిన జాదవ్ దివ్యను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు, పి.వెంగల్‌రావు, మాజీ జెడ్పీటీసీ విమల గోకుల్, మాజీ సర్పంచ్ జాదవ్ శంకర్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, తండానాయక్, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో తీజ్ బుట్ట ఎత్తుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899